క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. స్నేహనగర్, రాఘవేంద్ర నగర్, శ్రీనగర్ కాలనీ, పింగిళి జూనియర్ కళాశాల, బాలయ్య హోటల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. సొసైటీ కాలనీ, సాయిబాబా టెంపుల్, ఎస్ఆర్.నగర్ డబుల్ బెడ్రూంలు, ఎరుకల వాడ, వివేకానంద కాలనీ, కాశిబుగ్గ మెయిన్ రోడ్డు, స్తంభంపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రామన్నపేట /వరంగల్ అర్బన్: నగరంలోని 23వ డివిజన్ ఫకీర్ వాడలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, చిప్ప వెంకటేశ్వర్లు, ఝెలగం లీలావతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు 40శాతం రాయితీ పునరుద్ధరించాలి



హన్మకొండ: వృద్ధులకు రైల్వే టికెట్‌లో 40 శాతం రాయితీ అవకాశాన్ని పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్ కోరారు. ఈమేరకు హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనాకు ముందు వృద్ధులకు రైల్వే ప్రయాణంలో టికెట్ ధరలో 40 శాతం రాయితీ ఇచ్చే వారని గుర్తుచేశారు. ఆ అవకాశాన్ని పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ఆయుష్మాన్ భవ వైద్య సదుపాయాన్ని 60ఏళ్ల వారికి కూడా కల్పించాలని సూచించారు.

బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి




విద్యారణ్యపురి: బస్‌పాస్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ అశోకా జంక్షన్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ మాట్లాడుతూ పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

మడికొండ: పత్తి విత్తనాలను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. గాండ్ల రజిత, కర్ర సరిత అక్కాచెల్లెళ్లు కలిసి తమకు చెందిన భూమిలో నాలుగు రోజుల క్రితం పత్తి విత్తనాలను నాటారు. వారి పెద్దనాన్న కుమారుడు ముప్ప కుమారస్వామి ఆ విత్తనాలకు సోమవారం నష్టం కలిగించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

లక్ష గరికలతో అలంకరణ



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఘనంగా లక్ష గరిక పూజలను అర్చకులు బుధవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెచ్చిన గరికలతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో శ్వేతార్కుడిని అర్చకులు అభిషేకించారు. సహస్ర పుట్నాలతో తయారైన బెల్లం లడ్డులతో నైవేద్యం సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆ ఇళ్లను కూల్చివేస్తాం..

- ఎస్సారెస్పీ భూముల్లో అక్రమ నిర్మాణాలపై అధికారుల్లో కదలిక
- ఖాళీ చేయాలని హెచ్చరిక
- గుడిసెవాసుల ఆందోళన
- అధికారులతో వాగ్వాదం

హసన్‌పర్తి: సర్కారు స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను ఖాళీ చేయకుంటే కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎప్పుడు కూల్చివేస్తామో కూడా సమాచారం ఇవ్వబోమని తేల్చిచెప్పారు. ఎస్సారెస్పీ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈమేరకు నీటిపారుల శాఖ, పోలీస్‌శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని బుధవారం సందర్శించారు. నిర్మాణాలు కూల్చివేతకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా గుడిసెవాసులు, అధికారుల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది.

ఎస్సారెస్పీ భూములు ఆక్రమించి నిర్మాణాలు

రెండేళ్ల క్రితం నగరంలోని నిరుపేదలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన బలహీన వర్గాల ప్రజలు ఎస్సారెస్పీ భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. కొంతమంది పక్కా నిర్మాణాలు చేపట్టగా, మరికొంతమంది గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ప్రస్తుతం చింతగట్టు క్యాంప్ నుంచి పలువేల్పుల వరకు సుమారు వందకు పైగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

కదలిన అధికార యంత్రాంగం

భూముల కదలికపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో సంబంధిత అధికారుల్లో కదలిక మొదలైంది. ఈమేరకు రెండు రోజుల క్రితం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం తెల్లవారుజామున పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయికి చేరుకున్నారు. ఇళ్లు ఖాళీచేయాలని హెచ్చరిక చేశారు. నిరుపేదలు కావడంతో సర్కారు స్థలాల్లో గుడిసెలు వేసుకున్నామని బాధితులు చెప్పారు. నిర్మాణాలను కూల్చివేస్తే తమ కుటుంబాలు బజారున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని వాపోయారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

‘ఆపరేషన్ కగార్’ను ఆపేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ఖిలా వరంగల్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రాచర్ల బాలరాజు అధ్యక్షతన వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో వేర్పాటు వాదులు, ఉగ్రవాదులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కరించుకున్న దాఖలాలు అనేకం ఉన్నాయని అన్నారు. మావోయిస్టులతో మోదీ ప్రభుత్వం చర్చలు జరపకుండా వచ్చే మార్చికల్లా అంతం చేస్తామని ప్రకటించడం సమంజసం కాదని సూచించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి ఈనెల 14న ప్రదర్శన ఉంటుందని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్‌బాష్‌మియా, పనాస ప్రసాద్, సీపీఎం నాయకుడు వలదాసు దుర్గయ్య, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గంగుల దయాకర్, ఎంసీపీఐ (యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంగల్‌రెడ్డి, ప్రజా ఫ్రెంట్ నేత జనగాం కుమారస్వామి, ఏఐడీఎస్‌ఓ నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు



చిన్నారులతో సూపర్‌వైజర్ ఆశాదేవి

కాజీపేట అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందని కాజీపేట ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల (డంకెన్ బాబా) ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆరో రోజు కాజీపేటలోని జూబ్లీ మార్కెట్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు వివరించారు. అలాగే, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, పౌష్టికాహారం, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, మహేష్, బల్లా సతీష్‌కుమార్, సునీత, విద్యావతి, శైలజ, అనిత, జ్యోతిలక్ష్మి, రాణి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ పెరకవాడలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెరుమాండ్ల ఆశాదేవి హాజరై బడిబాట ర్యాలీని ప్రారంభించారు. ప్రీ స్కూల్ తల్లిదండ్రులు, పిల్లలకు పండ్లు అందజేశారు. 3 నుంచి 6ఏళ్ల లోపు పిల్లలకు టైంటేబుల్, వర్క్‌బుక్స్ అసెస్‌మెంట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భవాని, కళావతి, ఆయాలు పాల్గొన్నారు.

షాహిన్ స్కూల్‌పై చర్య తీసుకోవాలి



ఫ్లెక్సీలను తగులబెడుతున్న నాయకులు

రామన్నపేట: ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న షాహిన్ హైస్కూల్‌ను సీజ్ చేయడంతోపాటు యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎల్బీనగర్ ప్రాంతంలోని పాఠశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి హోర్డింగ్స్, ఫ్లెక్సీలను తగులబెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకుడు గడ్డం నాగార్జున మాట్లాడుతూ నగర నడిబొడ్డున షాహిన్ హైస్కూల్ పేరుతో అనుమతి లేకుండా పాఠశాలను స్థాపించి, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్

కాజీపేట అర్బన్: తమ ఇంటితో పరిసర ప్రాంతాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో రవీందర్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం వంద రోజుల యాక్షన్ ప్లాన్ – నేను సైతం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ఖిలా వరంగల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. ఈమేరకు వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో మలేరియా అధికారులు గురువారం ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ భావ్‌సింగ్



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్ నాయక్ సూచించారు. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని భట్టుపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. పాసుబుక్‌లో భూమి తక్కువగా వచ్చిందని, పాసుబుక్ రాలేదని, సాదాబైనామాలో కొనుగోలు చేసిన భూమికి పట్టా, పాసుబుక్ అందజేయాలనే ఫిర్యాదులతో 175 దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రణయ్, ఆర్ఐ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో 347 దరఖాస్తులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 347 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు డబ్బులకు ఆశపడి పట్టాదారుడి పేరును తొలగించిన వాటిస్థానంలో మరొకరి పేరు నమోదు చేశారని రెవెన్యూ సదస్సులో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 50మంది వరకు రైతుల పేర్లు పట్టాదారులుగా తొలగించినట్లు పేర్కొన్నారు. సాగులో ఉన్నప్పటికీ పట్టా మాత్రం తమ పేరుపై లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ చల్లా ప్రసాద్‌ను రైతులు వేడుకున్నారు.

‘కమిషన్ పేరిట కక్ష సాధింపు చర్యలు’



హైదరాబాద్ బీఆర్‌కే భవన్ వద్ద బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా నాయకులు

హన్మకొండ: కమిషన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఘోష్ కమిషన్ జరిపిన విచారణకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరైన క్రమంలో హనుమకొండ జిల్లా నుంచి బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ నీళ్ల, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమాన్ని ప్రారంభించి, ఆ గమ్యాన్ని ముద్దాడి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన యోధుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. కేసీఆర్ దార్శనికత, కార్యదక్షతతోనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తిఅయి తెలంగాణ కోటి ఎకరాల మాగాణం సాకారం అయిందని పేర్కొన్నారు. నాయకులు నాగూర్ల వెంకటేశ్వర్లు, పులి రజనీకాంత్, సోదా కిరణ్, సంకు నర్సింగ్, మేకల బాబురావు, ఇమ్మడి రాజు, కండేరావు నర్సింహారావు, జానకీ రాములుతో పాటు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అక్రమంగా చెరువు మట్టి తరలింపు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలోని చెరువు మట్టిని వారం రోజులుగా కొంతమంది అక్రమంగా తరలిస్తున్నారని విముక్త చిరుతల పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెరిపల్లి ఆనంద్ అన్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులపై చర్య తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు బుధవారం ఫిర్యాదు చేశారు. అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అవినీతి కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్నల రవికుమార్, చేతరాజు సుమన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలు

హసన్‌పర్తి: మొరం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్‌రెడ్డి తెలిపారు. హసన్‌పర్తిలోని ఆవుసుల కుంట నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న సందీప్, సుధాకర్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట హాజరు పర్చినట్లు ఎస్సై వివరించారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

కేయూ క్యాంపస్: మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని మాదిగ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేయూ అధ్యక్షుడు, బయాటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పోడెటి శ్రీనివాస్ తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో మంద కృష్ణ మాదిగ సన్మాన సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కేయూ జనరల్ సెక్రటరీ డాక్టర్ సుజాత, బాధ్యులు డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకుడు బొడ్డు దయాకర్ మాదిగ, బాధ్యులు డాక్టర్ కిశోర్, ఒంటేరు రవీందర్, కిరణ్, తిరుపతి మాదిగ, మంద భాస్కర్, వడ్డెపెల్లి మధుకర్, బొట్ల మనోహర్, కల్లెపెల్లి ప్రశాంత్, ఎల్తూరి సాయి పాల్గొన్నారు.



ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

వరంగల్: వరంగల్ ఏనుమాముల పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ ఏ.రాఘవేందర్‌కు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ను నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ అభినందన కార్యక్రమంలో ఎస్సార్‌నగర్, ఇందిరమ్మ కాలనీ అధ్యక్షులు మాచర స్టాలిన్, గొలుసుల సంతోష్, నాయకులు పిట్ట నగేష్, ఆర్మూర్ కుమార్, బొల్లం రవి, ల్యాగల భిక్షపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

తప్పిపోయిన వ్యక్తుల అప్పగింత

కాజీపేట రూరల్: రైల్‌లో తప్పిపోయిన పొరుగు రాష్ట్రానికి చెందిన ప్రయాణికుడిని ఆ ప్రయాణికుడితో కలిసి ప్రయాణిస్తున్న వారికి కాజీపేట జీఆర్పీ పోలీసులు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లో 35 మంది కలిసి రాయపూర్ నుంచి గోవా టూర్‌కు రైల్‌లో వెళ్తున్నారు. మార్గమధ్యలో ఘన్‌పూర్ స్టేషన్ తర్వాత రైలు ఆగింది. ఆ సమయంలో బృందంలోని కృష్ణ పటేల్ అనే ప్రయాణికుడు రైలు దిగి మూత్ర విసర్జన చేస్తుండగా రైలు కదిలింది. ఈక్రమంలో బృందంలో రమేష్‌కుమార్ అనే ప్రయాణికుడు రైల్ మదద్ దయల్ 139 నంబర్‌కు సమాచారం ఇచ్చాడు. ఘన్‌పూర్ రైల్వే పాయింట్స్‌మెన్ సదానందం ద్వారా కృష్ణపటేల్‌ను కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్, కానిస్టేబుల్ రాఘవేందర్ గుర్తించి అప్పగించారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

మడికొండ: తప్పిపోయిన వృద్ధుడిని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. రెండు రోజులుగా వాల్మీకినగర్‌లో తిరుగుతున్న వృద్ధుడి సమాచారాన్ని పోలీసులకు స్థానికులు అందించారు. ధర్మసాగర్ మండలం ధర్మపురానికి చెందిన ఎండీ హైదర్ సాబ్‌గా గుర్తించి అతడి కుమారుడు రహీమొద్దీన్‌కు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

ఆర్టీఐ కమిషనర్లకు అభినందనలు



మొహిసినా పర్వీన్‌ను సన్మానిస్తున్న బాధ్యులు

న్యూశాయంపేట: ఇటీవల నియమితులైన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమిషనర్లు మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని వరంగల్ జిల్లాకు చెందిన సమాచార హక్కు చట్టం ఉమ్మడి జిల్లా బాధ్యులు హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్గనైజర్ చెట్టబోయిన విద్యాసాగర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అమీర్‌ఖాన్, హనుమకొండ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ షరీఫ్, వరంగల్ జిల్లా స్టూడెంట్ సెక్రటరీ ఎద్దు రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌గా శివకుమార్



వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పనిచేశారు.